
సాక్షి
వైఎస్ఆర్ జిల్లా
మంగళవారం। 6। ఆగస్టు। 2024



కృష్ణమ్మ పరుగులు తీసేదెప్పుడు.!
గండికోట జలాశయంలోకి కృష్ణమ్మ పరవళ్లు ఎప్పుడు వస్తాయో అని రైతులు ఎదురు చూస్తున్నారు. గండికోట జలాశయంలో నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. -8లో



రాణించిన కడప బ్యాట్స్‌మన్
కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప బ్యాట్స్‌మన్ నలుగురు హాఫ్ సెంచరీలతో రాణించారు. -8లో

వాతావరణం
గరిష్టం/కనిష్టం
35.2/27.4
జిల్లాలో సోమవారం 27.4 – 35.2 డిగ్రీల మధ్య ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. గంటకు 8.0 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి. - కడప అగ్రికల్చర్.

న్యూస్‌రీల్

తైక్వాండో పోటీల్లో జిల్లా క్రీడాకారుల ప్రతిభ



పతకాలు సాధించిన క్రీడాకారులతో జిల్లా తైక్వాండో అసోసియేషన్ ప్రతినిధులు

కడప స్పోర్ట్స్: అనంతపురం జిల్లా తాడిపత్రిలో ఈనెల 2 నుంచి 4వ తేదీ వరకు నిర్వహించిన 2వ తైక్వాండో స్టేట్ చాంపియన్‌షిప్ పోటీల్లో వైఎస్ఆర్ కడప జిల్లా క్రీడాకారులు 16 పతకాలు సాధించినట్లు జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు బి. శివశంకర్‌రెడ్డి, నాయబ్‌రసూల్ తెలిపారు. జిల్లా నుంచి వివిధ కేటగిరీల్లో 41 మంది క్రీడాకారులు పాల్గొనగా 7 స్వర్ణపతకాలు, 4 రజత పతకాలు, 5 కాంస్యపతకాలను జిల్లా క్రీడాకారులు సాధించినట్లు తెలిపారు. ఇందులో స్వర్ణపతకాలు సాధించిన ఐదుగురు క్రీడాకారులు ఉత్తరప్రదేశ్‌లోని ఆగ్రాలో సెప్టెంబర్ 9 నుంచి 11వ తేదీ వరకు నిర్వహించనున్న జాతీయస్థాయి పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. నేషనల్స్‌కు వెళ్లే క్రీడాకారులకు ఏపీ ఉపాధ్యాయ సంఘాల ఐక్యవేదిక సమన్వయకర్త ఒంటేరు శ్రీనివాసులరెడ్డి రవాణా చార్జీలు రూ.2వేలు చొప్పున అందజేయనున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా నేషనల్స్‌కు ఎంపికైన ఫాతిమా, నదీష్, వెంకట కల్యాణ్, అబ్దుల్ మజీద్, చరణ్, ఖాన్, లోక్షితలను అభినందించారు.

'గ్రీవెన్స్'కు అర్జీల వెల్లువ



అర్జీలను పరిశీలిస్తున్న డీఆర్వో గంగాధర్‌గౌడ్

కడప సెవెన్‌రోడ్స్: జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన డయల్ యువర్ కలెక్టర్, గ్రీవెన్స్‌సెల్‌కు సమస్యలు వెల్లువెత్తాయి. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతులు సమర్పించారు.

- ప్రభుత్వ పాఠశాలల్లో నాలుగు నెలలుగా స్వీపర్లకు పెండింగ్‌లో ఉన్న వేతనాలు చెల్లించాలని ఏఐటీయూసీ జిల్లా డిప్యూటీ జనరల్ సెక్రటరీ కేసీ బాదుల్లా కోరారు. స్వీపర్లపై విద్యా కమిటీలు, రాజకీయ నాయకుల వేధింపులు లేకుండా చూడాలన్నారు. సామాజిక భద్రతా చట్టంలో భాగంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలు కల్పించాలని కోరారు.
- ప్రొద్దుటూరు ప్రభుత్వ ఎస్సీ హాస్టల్–2 వార్డెన్ రామకృష్ణారెడ్డిపై చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల రెవల్యూషనరీ విద్యార్థి యువజన సంఘం జిల్లా కన్వీనర్ ఓరుగంటి నాగేంద్రబాబు కోరారు. నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తూ విద్యార్థులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్న ఆయన వ్యవహారశైలిపై విచారణ చేయడంతోపాటు విద్యార్థులకు తగిన వసతులు కల్పించాలని విన్నవించారు.
- వేంపల్లె ఎంఈఓ జాఫర్ సాదిక్ పలు అవకతవకలకు పాల్పడుతున్నప్పటికీ డీఈఓ అనూరాధ ఆయనను కాపాడుతున్నారని, వీరిద్దరిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల విద్యార్థి యువజన సమాఖ్య రాష్ట్ర కన్వీనర్ కత్తి ఓబులేశు కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

జానపద కళలను ప్రోత్సహించాలి



జానపద ఉత్సవంలో విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి తదితరులు

ప్రొద్దుటూరు : ప్రతి ఒక్కరూ జానపద కళలను ప్రోత్సహించాలని జనపద కళల పరిశోధకులు, మన సంస్కృతి గౌరవ సలహామండలి సభ్యులు విద్వాన్ డాక్టర్ మూలె రామమునిరెడ్డి తెలిపారు. సోమవారం స్థానిక అగస్త్యేశ్వరస్వామి ఆలయంలో ప్రపంచ జానపద కళా దినోత్సవం సందర్భంగా తిరుపతికి చెందిన మన సంస్కృతి సంస్థ ఆధ్వర్యంలో మాసోత్సవాల్లో భాగంగా జానపద ఉత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మూలె రామమునిరెడ్డి మాట్లాడుతూ మరుగున పడిన అలనాటి జానపద గీతాలను వెలుగులోకి తీసుకొచ్చి జీవం పోయడానికి మన సంస్కృతి కళా సంస్థ ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. మన సంస్కృతి కళా సంస్థ ప్రధాన కార్యదర్శి కలకట రెడ్డప్ప మాట్లాడుతూ జనపద కళల పునరుజ్జీవానికి ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అగస్త్యేశ్వరస్వామి ఆలయ కమిటీ వైస్ చైర్మన్ మల్లికార్జున శెట్టి, జన విజ్ఞాన వేదిక సభ్యుడు చంద్రశేఖర్‌రావు, గాయకుడు చలమయ్య, మ్యూజీషియన్ హరేరామ్, ప్రొద్దుటూరు నాగమణి జానద కళాబృందం, మనసంస్కృతి కళా సంస్థ సభ్యుడు వెంకటస్వామి, ఎం.సూర్యనారాయణరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వాడిపోతున్న ఆశలు

- తీవ్ర వర్షాభావంతో ఎండుతున్న పంటలు
- ఆందోళనలో అన్నదాతలు
- కొన్ని చోట్ల దున్నేస్తున్న వైనం
- ప్రభుత్వం ఆదుకోవాలంటూ వేడుకోలు



ఎండిపోయిన మినుము పంటను ట్రాక్టర్‌తో దున్నేస్తున్న రైతు



కొండాపురం మండలంలో ఎండుముఖం పట్టిన సన్‌ఫ్లవర్

కడప అగ్రికల్చర్: ఎన్నో ఆశలతో సాగు చేసిన పంటలు కళ్ల ముందే ఎండిపోతుంటే రైతుల గుండె తరుక్కుపోతోంది. నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందనే ఆశలు అడియాసలయ్యాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమై రెండు నెలలు అయినా.. ఇంత వరకు ఈ క్రాపు నమోదు చేయలేదు. దీంతో వేలకు వేలు ఖర్చు చేసి పంటలను సాగు చేసిన అన్నదాతలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం నెలకొంది. సకాలంలో ఈ క్రాపు నమోదు చేసి ఉంటే.. ప్రస్తుతం వర్షాభావంతో ఎండిన పంటలకు అంతో ఇంతో నష్టపరిహారమైనా వచ్చి ఉండేదని పలువురు అంటున్నారు.

పెట్టుబడి ఖర్చులు భారమై..
జిల్లా వ్యాప్తంగా మెట్ట ప్రాంతాల్లో సాగు చేసిన ఆరుతడి పంటలైన మినుము, వేరుశనగ, పత్తి, పెసర, కొర్రలతోపాటు పలు పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చాలా మంది రైతులు తాము సాగు చేసిన పంటలను దున్నేస్తున్నారు. మరి కొంతమంది పంటలు పూర్తిగా ఎండిపోవడంతో చేసేదేమీ లేక అలాగే వదిలేశారు. ఫలితంగా సాగుతోపాటు సేద్యం, ఎరువులు, విత్తనాలు ఖర్చులు నెత్తికొచ్చాయని పలువురు రైతన్నలు వాపోతున్నారు. ముఖ్యంగా కౌలు రైతుల పరిస్థితి మరింత ఆందోళనకరంగా మారింది. సాగు చేసిన ఖర్చులన్నీ నెత్తికి రావడంతోపాటు కౌలు ఎలా చెల్లించాలని లబోదిబోమంటున్నారు.

జూన్ నెలతోనే విరమించిన వర్షం
ఈ ఏడాది ఖరీఫ్ ప్రారంభమైన జూన్‌లోనే వర్షాలు బాగా కురిశాయి. ఆ నెలలో సాధారణ వర్షపాతం 60.2 ఎంఎం కాగా అత్యధికంగా 138.4 ఎంఎం కురిసింది. దీంతో చాలా మంది మెట్ట ప్రాంతాల్లో ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి ఆరుతడి పంటలైన మినుము, పత్తి, వేరుశనగ, మొక్కజొన్న, కొర్ర, కంది, ఆముదం, సోయాబీన్ తదితర పంటలను సాగు చేశారు. తరువాత జూలైలో అరకొరగానే కురిసింది. ఆ నెలలో సాధారణ వర్షపాతం 96.7 ఎంఎం కురవాల్సి ఉండగా 52.4 ఎంఎం మాత్రమే కురిసింది. సాధారణ వర్షపాతం కంటే 45.8 ఎంఎం తక్కువ కురిసింది. దీనికితోడు విపరీతంగా గాలులు వీస్తుండటంతో భూమిలోని తడంతా పూర్తిగా ఆరిపోయింది. ఫలితంగా పంటలు ఎండుముఖం పట్టాయి. దీంతో చాలా మంది రైతులు ఎండిపోయిన పంటలను దున్నేస్తున్నారు.

జిల్లాలో పంటల సాగు వివరాలు ఇలా: జిల్లాలో 2024–25 ఏడాదికి సంబంధించి సాధారణ సాగు 75189 హెక్టార్లు కాగా ప్రస్తుతం జిల్లాలో 21071 హెక్టార్లలో పలు పంటలు సాగై 28.02 శాతం పంటలు సాగయ్యాయి. ఇందులో 4755 హెక్టార్లలో వరి పంట, 420 ఎకరాల్లో సజ్జ, 1101 హెక్టార్లలో మొక్కజొన్న, 537 హెక్టార్లలో కొర్ర, 739 హెక్టార్లలో కంది, 63 హెక్టార్లలో పెసర, 3971 హెక్టార్లలో మినుము, 2496 హెక్టార్లలో వేరుశనగ, 207 హెక్టార్లలో ఆముదం, 258 హెక్టార్లలో సోయాబీన్, 6362 హెక్టార్లలో పత్తిలతోపాటు పలు పంటలు కలిపి మొత్తం 21070 హెక్టార్లలో సాగయ్యాయి.

కమలాపురం నియోజకవర్గంలో అత్యధికంగా..
కమలాపురం నియోజకవర్గంలోని వీఎన్‌పల్లి, కమలాపురం, వల్లూరు మండలాల్లో అత్యధికంగా 5 వేల ఎకరాల్లో మినుము పంట ఎండిపోయినట్లు పలువురు రైతులు తెలిపారు. దీంతోపాటు వేరుశనగ, కొర్ర, పొద్దుతిరుగుడు పంటలు కూడా ఎండుముఖం పట్టాయి. అలాగే జమ్మలమడుగు నియోజకవర్గంలో యర్రగుంట్ల, కొండాపురం, మైలవరం మండలాల్లో కూడా మినుము, వేరుశనగ, పెసర పంటలు ఎండుముఖం పట్టాయని పలువురు రైతన్నలు తెలిపారు. జిల్లా వ్యాప్తంగా 6 వేల ఎకరాలకు పైగానే పంటలు ఎండుముఖం పట్టినట్లు పలువురు రైతన్నలు తెలిపారు. ఏదిఏమైనా ఖరీఫ్ సీజన్ కలిసి రాలేదని పలువురు రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వల్లూరులో ఎండిపోయిన మినుము పంట

ప్రభుత్వం ఆదుకోవాలి



నా పేరు వెదురూరు నాగేశ్వరరెడ్డి. నేను ఇటీవల జూన్ నెలలో కురిసిన వర్షానికి నాకున్న 5 ఎకరాల్లో మినుము పంటను సాగు చేశారు. తర్వాత వర్షాలు కురవకపోవడంతో పంట ఎండిపోయింది. పెట్టుబడి రూ.50 వేల వరకు ఖర్చు అయింది. ప్రభుత్వమే ఆదుకోవాలి.
– వెదురూరు నాగేశ్వరరెడ్డి, రైతు, కంచన్నగారిపల్లె, కమలాపురం మండలం

15 ఎకరాల్లో మినుము పంట దున్నేశా..



నా పేరు వెంకటక్రిష్ణయ్య. మాది ఎర్రగుంట్ల. నేను 15 ఎకరాల భూమిని కౌలుకు తీసుకుని జూన్ నెలలో మినుము పంటను సాగు చేశాను. ఇందుకోసం సేద్యాలు, విత్తనాలు, ఎరువులకు కలిపి ఎకరాకు రూ.10 వేలు ఖర్చు పెట్టాను. తరువాత వర్షాభావ పరిస్థితి వల్ల 15 ఎకరాల్లో మినుము పంట ఎండిపోయింది. దీంతో అంతా దున్నేశాను. దున్నేందుకు కూడా ఎకరాలకు 2 వేల దాకా ఖర్చు వచ్చింది. దాదాపు లక్షా 80 వేలు దాకా నష్టం వచ్చింది. నన్ను ప్రభుత్వమే ఆదుకోవాలి.
– వెంకట క్రిష్ణయ్య, మినుము రైతు, ఎర్రగుంట్ల

మూడు ఎకరాలు ఎండిపోయింది



నేడు మూడు ఎకరాల్లో మినుము పంటను సాగు చేశాను. వర్షాభావ పరిస్థితులతో మూడు ఎకరాలు ఎండిపోయింది. మూడు ఎకరాల సాగుకు రూ.45 వేలు ఖర్చు పెట్టాను. ఇప్పుడేమో వర్షాభావంతో ఎండిపోయిన పంట దున్నేయాల్సి వస్తుంది. ప్రభుత్వం నష్ట పరిహారం అందించి ఆదుకోవాలి. – చిలంకూరు రమణయ్య, మినుము రైతు, ఊటుకూరు

సకాలంలో ఈ క్రాప్ చేసి ఉంటే...



ప్రభుత్వం సకాలంలో ఈ క్రాపు నమోదు చేసి ఉంటే రైతులకు మేలు జరిగి ఉండేది. జిల్లాలో ఆరుతడి పంటల కింద సాగు చేసిన మినుము, పెసర, పత్తితోపాటు పలు పంటలు ఎండిపోయాయి. దీంతో చాలా మంది రైతులు పంటలను దున్నేస్తున్నారు. వీరందరికీ ఈ క్రాపు నమోదు చేసి ఉంటే అంతో ఇంతో మేలు జరిగి ఉండేది. వీరందరిని ప్రభుత్వమే ఆదుకోవాలి.
– దస్తగిరిరెడ్డి, ఏపీ రైతు సంఘం కార్యదర్శి, వైఎస్ఆర్ జిల్లా

కేవీకేలో ఘనంగా స్వర్ణోత్సవాలు



మాట్లాడుతున్న కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య

కడప అగ్రికల్చర్: రైతులకు వ్యవసాయ పరంగా శాస్త్రీయ సలహాలు ఇవ్వడంతోపాటు వ్యవసాయ సాంకేతికతకు కృషి విజ్ఞాన కేంద్రం (కేవీకే) వనరుల కేంద్రంగా పని చేస్తూ జిల్లా ఆర్థిక పరిస్థితి మెరుగుపరచడానికి కృషి చేస్తోందని కేవీకే కో ఆర్డినేటర్ డాక్టర్ వీరయ్య పేర్కొన్నారు. దేశంలో కృషి విజ్ఞాన కేంద్రాల స్వర్ణోత్సవాల్లో భాగంగా సోమవారం ఊటుకూరు కేవీకేలో స్వర్ణోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కడప కేవీకే ద్వారా రైతులకు విశేష సేవలు అందజేస్తున్నామన్నారు. కార్యక్రమంలో ఏరువాక కేంద్ర ప్రధాన శాస్త్రవేత్త అంకయ్యకుమార్, వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త శ్రీనివాస ఆచారి, రైతు శిక్షణ కేంద్ర ఏడీఏ రమణారెడ్డి, ఆత్మ ఉప సంచాలకులు పద్మావతి, శాస్త్రవేత్తలు ప్రశాంతి, శిల్పకళ, మహేష్‌బాబు, సాయి మహేశ్వరి, మానస, సురేష్‌కుమార్‌రెడ్డి, వ్యవసాయ పరిశోధన స్థానం శాస్త్రవేత్తలు కేవీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఫిర్యాదులపై సత్వరం స్పందించాలి



బాధితులతో మాట్లాడుతున్న అదనపు ఎస్పీ లోసారి సుధాకర్

కడప అర్బన్: జిల్లాలో బాధితులు పోలీసు శాఖకు ఇచ్చే ఫిర్యాదుల పట్ల సత్వరం స్పందించి తగిన చర్యలు తీసుకోవాలని జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) లోసారి సుధాకర్, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అదనపు ఎస్పీ జి.వెంకటరాముడు పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లా ఎస్పీ వి.హర్షవర్ధన్‌రాజు ఆదేశాల మేరకు స్థానిక జిల్లా పోలీసు కార్యాలయంలోని 'పెన్నార్ పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్'లో 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పబ్లిక్ గ్రీవెన్స్ రిడ్రెస్సల్ సిస్టమ్) కార్యక్రమంలో బాధితులతో వారు ముఖాముఖి మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. ఫిర్యాదులకు అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, నిర్ణీత సమయంలో పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని పోలీసు అధికారులను ఆదేశించారు. ప్రజలు సైబర్ క్రైమ్‌కు సంబంధించి ఎలాంటి సమస్య వున్నా ఆన్‌లైన్ వెబ్ సైట్ డబ్ల్యూ డబ్ల్యూ డబ్ల్యూ డాట్ సైబర్ క్రైమ్ డాట్ జీఓవి డాట్ ఇన్ ద్వారా నేషనల్ క్రైమ్ రిపోర్టింగ్ పోర్టల్ (ఎన్.సి.ఆర్.పి)లో ఫిర్యాదు చేయొచ్చని డి.టి.సి డీఎస్పీ కె.రవికుమార్ తెలిపారు.

వైవీయూ పీజీ నాలుగో సెమిస్టర్ ఫలితాలు విడుదల



పరీక్షా ఫలితాలను విడుదల చేస్తున్న వీసీ, రిజిస్ట్రార్

వైవీయూ: యోగి వేమన విశ్వవిద్యాలయం పోస్ట్ గ్రాడ్యుయేషన్ 4వ సెమిస్టర్ ఫలితాలను విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, రిజిస్ట్రార్ ఆచార్య ఎస్.రఘునాథ్ రెడ్డి, కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఆచార్య ఎన్. ఈశ్వర్‌రెడ్డిలు విడుదల చేశారు. పీజీ కోర్సులైన సైకాలజీ, మైక్రోబయాలజీ, మ్యాథమ్యాటిక్స్, జియాలజీ, ఫుడ్ టెక్నాలజీ, జువాలజీ, మైక్రోబయాలజీ, ఎన్విరాన్మెంటల్ సైన్సు , బోటనీ, బయోటెక్నాలజీ, బయోకెమిస్ట్రీ, ఫిజిక్స్, ఎంపీఈడీ సబ్జెక్టులలో ఉత్తమ ఫలితాలు లభించాయన్నారు. కార్యక్రమంలో సహాయ పరీక్షల నియంత్రణ అధికారులు డా. మమత కుమారి, డా.శ్రీనివాసరావు, డాక్టర్ వెంకట్రామ్ పాల్గొన్నారు.

తిరగబడ్డ జీవితాలు

- కష్టాల్లో పాలేగార్ వారసులు
- నామమాత్రపు పెన్షన్‌తో ఇక్కట్లు
- పోరుబాటకు కార్యాచరణ



పాలేగార్ సంప్రదాయాయ వేడుకలో వారసులు (ఫైల్)



కడప సెవెన్‌రోడ్స్: వారసత్వంగా తమకు వస్తున్న తవర్జీ (పెన్షన్) పెంపు, ఆగిపోయిన వారికి పునరుద్ధరణ కోసం పూర్వపు పాలేగార్ వారసులు చాలా కాలంగా ప్రభుత్వాన్ని కోరుతున్నారు. ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తాము తిరుగుతున్నా అధికారుల నుంచి నిరాదరణే ఎదురవుతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మన్రో కాలం నుంచి ఇస్తున్న రూ. 13 నుంచి రూ.40లనే నేటికీ ఇస్తున్నారని వారు వాపోతున్నారు. ప్రజాప్రతినిధులు, రాజకీయ పక్షాలు, ప్రజా సంఘాల మద్దతుతో రాష్ట్ర ప్రభుత్వ దృష్టికి తమ సమస్యలు తీసుకెళ్లేందుకు అవసరమైన కార్యాచరణకు సమాయత్తమవుతున్నారు.

నేపథ్యం
పరిపాలన సౌలభ్యం కోసం కాకతీయుల కాలంలో పురుడు పోసుకుని విజయ నగర రాజుల కాలంలో పాలేగార్ వ్యవస్థ వైభవాన్ని చవిచూసింది. అడవులు నరికి వ్యవసాయ భూములు తయారు చేయడం, చెరువులు, కుంటలు నిర్మించడం ద్వారా వీరు వ్యవసాయ అభివృద్ధికి పాటుపడ్డారు. రైతుల నుంచి భూమి శిస్తు వసూలు చేసి రాజుకు చెల్లించడం, యుద్ధ సమయాల్లో అవసరమైన కట్టుబడి సైన్యాన్ని పంపడం వీరి ప్రధాన విధులుగా ఉండేవి. ఇలా గ్రామస్థాయిలో రెవెన్యూ, పోలీసు, జ్యుడిషరీ విధులను వీరు నిర్వర్తించేవారు.

మన్రో రాకతో వ్యవస్థ రద్దు
రాయలసీమ బ్రిటీషు వారికి దారాదత్తమై థామస్ మన్రో మొదటి ప్రిన్సిపల్ కలెక్టర్‌గా 1800 నవంబరు 1వ తేదీ బాధ్యతలు చేపట్టారు. అప్పటికి రాయలసీమలో 80 మంది ప్రధాన పాలేగార్స్ ఉండగా, అందులో 49 మంది కడప జిల్లాలో ఉండేవారు. బ్రిటీషు ప్రభుత్వం వీరి ఆధీనంలో ఉన్న గ్రామాలను స్వాధీనం చేసుకుంది. ఎదురు తిరిగిన వారిని గుత్తికోటలో ఉరి తీశారు. లొంగిపోయిన వారి జీవనాధారం కోసం తవర్జీ ఏర్పాటు చేశారు.

దీనావస్థలో..
రాయలసీమలో ప్రస్తుతం 86 మంది పాలేగార్ వారసుల కుటుంబాలు ఉన్నట్లు తెలుస్తోంది. వీరిలో చాలా మంది కటిక దారిద్ర్యంలో జీవిస్తున్నారు. నిరక్షరాస్యుల సంఖ్య ఎక్కువగా ఉంది. చిన్న, సన్నకారు రైతులుగా ఎక్కువ మంది కనిపిస్తారు. మరికొందరు ఉపాధి పనులు చేసుకుంటూ జీవనం గడుపుతున్నారు. స్వాతంత్ర్యం వచ్చాక పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వీరి తవర్జీ పెంచలేదు. ఆనాడు మన్రో ఇచ్చిన రూ. 13 నుంచి రూ.40లనే నేటికీ ఇస్తున్నారు. కొంత మందికి వివిధ కారణాలతో పెన్షన్ ఆపివేయడంతో వీరిలో ఆందోళన నెలకొంది. రద్దయిన ఒకప్పటి జాగీర్లు, ఎస్టేట్స్‌లో పని చేసిన ఉద్యోగుల పెన్షన్లను రివైజ్ చేస్తున్న ప్రభుత్వాలు వీరి పెన్షన్లకు మాత్రం సాధారణ నిబంధనలు వర్తించబోవంటూ మెలిక పెడుతోంది.

ప్రాతినిధ్యం కల్పించాలి



మా తండ్రి సత్యనారాయణరావుకు 1995 వరకు రూ.881 తవర్జీ ఇచ్చేవారు. ఆయన మరణంతో ఆగిపోయింది. పాలేగార్స్ కట్టించిన దేవాలయాలకు సంబంధించిన కమిటీలలో వారసులకు ప్రాతినిధ్యం కల్పించాలి. – జానకి రఘు, ప్రధాన కార్యదర్శి, ఏపీ పాలేగార్ వారసుల సంక్షేమ సంఘం

అధికారుల చుట్టూ ప్రదక్షిణలు



మా తండ్రి కడపరాజు నారాయణరాజు చనిపోయే వరకు అంటే 1993 ఏప్రిల్ వరకు పెన్షన్ వచ్చేది. నేను లీగల్ హెయిర్ సర్టిఫికెట్ జిల్లా ట్రెజరీ అధికారికి సమర్పించగా, ఆ సంవత్సరం డిసెంబరులో అరియర్స్ ఇచ్చారు. ఆ తర్వాత పెన్షన్ ఆగిపోయింది. అప్పటి నుంచి అధికారుల చుట్టూ ప్రదక్షిణ చేసినా ఫలితం లేకుండా పోయింది.
– కె.విజయవర్మ, మట్లిరాజుల వంశీయులు

సమస్యలు పరిష్కరించాలి



చాలా కుటుంబాలకు పెన్షన్లు తొలగించారు. పెన్షన్ మొత్తాన్ని ఇప్పటి ధరలకు అనుగుణంగా పెంచడంతోపాటు నిలిపివేసిన వారికి పునరుద్ధరించాలి. ఈ అంశాన్ని సీఎం దృష్టికి తీసుకు వెళ్లేందుకు ప్రయత్నాలు చేస్తున్నాం. – వై.కేశవులు నాయుడు, అధ్యక్షుడు, ఏపీ పాలేగార్ వారసుల సంక్షేమ సంఘం

పెన్షన్ పెంచండి



మాట్లాడుతున్న ఏపీ పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘ నాయకులు

కడప సెవెన్‌రోడ్స్: రాష్ట్ర ప్రభుత్వం పాలేగార్స్ వారసులకు ఇస్తున్న తవర్జీ (పెన్షన్) మొత్తాన్ని పెంచాలని, కొంత మందికి అర్థాంతరంగా నిలిచిపోయిన తవర్జీ పునరుద్ధరించాలని ఆంధ్రప్రదేశ్ పాలేగార్స్ వారసుల సంక్షేమ సంఘం అధ్యక్షులు వై.కేశవులు నాయుడు, ప్రధాన కార్యదర్శి జానకి రఘు కోరారు. స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఆ సంఘ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో ఆ సంఘ నాయకులు మంగమనాయుడు, నలగాటి వెంకటేశ్వర్లు, చంద్రప్పనాయుడు, బలరామయ్య, నక్కా వెంకట రమణ, పార్థసారథి నాయుడు, ఎల్.బాషా, ప్రముఖ చరిత్ర పరిశోధకులు తవ్వా ఓబుల్‌రెడ్డిలు పాల్గొన్నారు.

సాగునీటి సమస్య పరిష్కారానికి చర్యలు

- కలెక్టర్ల సమావేశంలో చర్చ



సమావేశంలో జిల్లా కలెక్టర్ శివశంకర్

కడప సెవెన్‌రోడ్స్: ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు అధ్యక్షతన సోమవారం అమరావతిలో కలెక్టర్ల సమావేశం జరిగింది. కడప కలెక్టర్ శివశంకర్ లోతేటి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లాలో చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిసింది. ముఖ్యంగా గండికోట, బ్రహ్మంసాగర్ రిజర్వాయర్ల కింద డిస్ట్రిబ్యూటరీలు, ఫీల్డ్ ఛానల్స్ ఏర్పాటు చేస్తే నిర్దేశిత ఆయకట్టుకు సాగునీరు అందించవచ్చు. కొప్పర్తి పారిశ్రామికవాడలో చేయాల్సిన అభివృద్ధి పనులు చాలా ఉన్నాయి. కొత్తగా పరిశ్రమలను ఆకర్షించేందుకు చర్యలు చేపట్టాల్సిన అవసరం ఉంది. మెగా ఇండస్ట్రియల్ పార్కుకు నీటి సరఫరా కోసం సమ్మర్ స్టోరేజీ ట్యాంకు ఏర్పాటు అవసరం, జిల్లాలో చేనేత రంగానికి పూర్వ వైభవం తీసుకు రావడానికి మైలవరం టెక్స్‌టైల్ పార్కు అభివృద్ధి చేయాల్సి ఉంది. గండికోటలో పర్యాటక అభివృద్ధికి తీసుకోవాల్సిన చర్యల గురించి సీఎంకు నివేదించినట్లు తెలుస్తోంది. వ్యవసాయ రంగానికి సంబంధించి సబ్సిడీ విత్తనాలు, డ్రిప్ తదితర అంశాల గురించి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లినట్లు సమాచారం. ముఖ్యమంత్రి కలెక్టర్లతో నిర్వహించిన సమావేశాన్ని కడప కలెక్టరేట్ వీసీ హాలు నుంచి జేసీ అదితి సింగ్, వివిధ శాఖల అధికారులు వర్చువల్ విధానం ద్వారా వీక్షించారు.

క్లుప్తంగా

నాటుసారా స్వాధీనం

మైలవరం : మండల పరిధిలోని తలమంచిపట్నం పోలీసు స్టేషన్ పరిధిలోగల పెద్దకొమెర్ల గ్రామంలో అక్రమంగా అమ్ముతున్న నాటుసారాను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సోమవారం ఎస్ఐ హనుమంతు వివరాలను వెల్లడించారు. పెద్దకొమెర్ల గ్రామం సచివాలయం సమీపంలో ఉన్న చల్లా ఇసాక్ అనే వ్యక్తి అక్రమంగా నాటు సారా అమ్ముతుండగా 280 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నామన్నారు. నంద్యాల జిల్లా అవుకు మండలం కొండనాయినిపల్లి గ్రామం నుంచి వెంకటేశ్ నాయక్ అనే వ్యక్తి సారా ప్యాకెట్లను ఇసాక్‌కు సరఫరా చేశాడన్నారు. ఆ మేరకు నిందితులిద్దరిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు ఎస్ఐ తెలిపారు.

కంకర టిప్పర్ బోల్తా



తొండూరు : కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ అదుపుతప్పి బోల్తాపడింది. ఈ ఘటన తొండూరు మండలం ఇనగలూరు గ్రామ సమీపంలో ఆదివారం రాత్రి జరిగింది. పులివెందుల నుంచి ముద్దనూరు వైపు కంకర లోడ్‌తో వెళ్తున్న టిప్పర్ ఇనగలూరు గ్రామ సమీపంలోకి రాగానే ఎదురుగా వస్తున్న వాహనాన్ని తప్పించబోయి అదుపుతప్పి బోల్తాపడింది. వాహనంలో డ్రైవర్, క్లీనర్ మాత్రమే ఉండగా వారు సురక్షితంగా బయటపడ్డారు. ఎలాంటి ప్రాణాపాయం లేకపోవడంతో డ్రైవర్ ఊపిరి పీల్చుకున్నాడు.

రెడీమేడ్ షోరూం యజమానిపై దాడి


కడప అర్బన్ : కడప నగరం వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉడిపిహోటల్ ఎదురుగా ఉన్న 'వికాస్ రెడీమేడ్ షోరూం' యజమాని వికాస్ కుమార్‌పై కొందరు వ్యక్తులు దాడి చేశారు. తన షాపులో పనిచేస్తున్న బాలాజీ అనే యువకుడిని సరిగా పనికి రాకపోతే మానెయ్యాలని యజమాని చెప్పాడు. దీంతో బాలాజీ తన స్నేహితులైన శ్రీధర్, ఉపేంద్రలతో కలిసి వచ్చి దాడి చేశాడు. ఈ సంఘటనలో దుకాణ యజమాని గాయపడ్డాడు. సోమవారం బాధితుడి ఫిర్యాదు మేరకు సీఐ భాస్కర్ రెడ్డి కేసు నమోదు చేశారు.

ఇరువర్గాల మధ్య ఘర్షణ

తొండూరు : తొండూరు మండల పరిధిలోని ఇనగలూరు గ్రామంలో ఆదివారం రాత్రి ఇరు వర్గాల మధ్య ఘర్షణ జరిగింది. కదిరి దస్తగిరి రెడ్డి అనే వ్యక్తి కదిరి నాగేశ్వరరెడ్డి అప్పు ఉన్నాడు. దీంతో డబ్బులు అడగడంతో మాటామాటా పెరిగి ఘర్షణకు దారితీసింది. దీంతో ఇరువురి కుటుంబ సభ్యులతో పాటు మరికొందరు గొడవ పడ్డారు. ఈ ఘర్షణలో గ్రామానికి చెందిన కదిరి రామచంద్రారెడ్డితో పాటు మరొకరికి స్వల్ప గాయాలయ్యాయి. వారిని 108 వాహనంలో పులివెందుల ఏరియా ఆసుపత్రికి తరలించారు. సీఐ బాలమద్దిలేటి, ఎస్ఐ లక్ష్మినారాయణ సిబ్బందితో హుటాహుటిన ఇనగలూరు గ్రామానికి చేరుకొని గొడవ పడుతున్న వారిని చెదరగొట్టారు. ఈ ఘర్షణకు సంబంధించి ఇరు వర్గాలపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

బిరబిరా కృష్ణమ్మ పరుగులు తీసేదెప్పుడు.!

- డెడ్ స్టోరేజీకి చేరుకున్న గండికోట, మైలవరం జలాశయాలు
- కృష్ణా జలాల కోసం ఎదురు చూస్తున్న రైతులు



ఎండిపోయిన గండికోట ప్రాజెక్టు

జమ్మలమడుగు : గండికోట జలాశయంలోకి బిరబిరా కృష్ణమ్మ పరవళ్లు ఎప్పుడు వస్తాయో అని రైతులు, ప్రజలు ఎదురు చూస్తున్నారు. గత ఏడాది సరైన వర్షాలు పడకపోవడంతో మైలవరం జలాశయం, గండికోట జలాశయంలోని నీటి నిల్వలు పూర్తిగా తగ్గిపోయాయి. ప్రస్తుతం రెండు జలాశయాల్లో కనీసం రెండు టీఎంసీల నీరు కూడా నిల్వ లేదని అధికారులు పేర్కొంటున్నారు.

అవుకు రిజర్వాయర్‌కు 600 క్యూసెక్కుల నీరు విడుదల

వెలుగోడు ప్రాజెక్టు నుంచి నంద్యాల జిల్లా అవుకు రిజర్వాయర్‌కు గాలేరు–నగరి కాలువల ద్వార 600 క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్‌లో 1.5 టీఎంసీల నీరు నిల్వ ఉంది. పూర్తి స్థాయిలో నీటిని నింపాలంటే 4.5 టీఎంసీల నీరు ఉండాలి. జలాశయంలోకి నిల్వ సామర్థ్యం మేరకు నీరు రావాలంటే కనీసం నెలరోజులకు పైగా పట్టే అవకాశం ఉంది. గాలేరు–నగరి కాలువల ద్వారా ఒక టీఎంసీ నీరు చేరాలంటే కనీసం పదివేల క్యూసెక్కుల నీరు ఒక్కరోజు పారితే నాలుగు రోజుల్లో జలాశయం నిండుతుంది. ఆ తర్వాత గాలేరు–నగరి కాలువకు నీటిని విడుదల చేయాల్సి ఉంది. ప్రస్తుతం ఆ స్థాయిలో నీరు రావడం లేదు.

గండికోటలో 1.4 టీఎంసీల నీరు..

గండికోట జలాశయంలో పూర్తిస్థాయి నీటి మట్టం 26 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో కేవలం 1.4 టీఎంసీల నీరు మాత్రమే నిల్వ ఉంది. సరైన వర్షాలు లేకపోవడంతో ఉన్న నీరు తాగునీటి అవసరాలకు మాత్రమే సరిపోతున్నాయి. రైతుల పంట పొలాలకు వదిలే పరిస్థితి లేదు. దీంతో ఈ ఏడాది గండికోట ప్రాజెక్టులోకి కేవలం శ్రీశైలం నుంచి వచ్చే కృష్ణా జలాలపైనే ఆధారపడాల్సి వస్తోంది.


మైలవరంలో...

మైలవరం జలాశయం నీటి సామర్థ్యం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం జలాశయంలో 0.585 టీఎంసీల నీరు మాత్రమే ఉంది. ఈ నీరు ప్రతిరోజు జమ్మలమడుగు, ప్రొద్దుటూరు ప్రజల దాహార్తి తీర్చడం కోసం, మరి కొంత నీరు ఆర్టీపీపీకి పంపింగ్ చేయాల్సి ఉంది. మరి కొద్ది రోజుల్లో మైలవరం జలాశయం పూర్తిగా డెడ్ స్టోరేజిలోకి వెళ్లిపోతుంది. సరైన వర్షాలు లేకపోవడంతో పెన్నానది పరివాహక ప్రాంతాల నుంచి నీరు గండికోటలో చేరుతుంది తప్ప మైలవరం జలాశయంలోనికి రాదు. దీంతో కొండ ప్రాంతంలో పడిన నీరు మాత్రమే జలాశయంలోకి రావాల్సి ఉంది.

శ్రీశైలంపైనే ఆశలు...

రాయలసీమ ప్రజలకు సాగునీరు.. తాగునీరు అందించాలనే లక్ష్యంతో నాడు దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి గండికోట ప్రాజెక్టును పూర్తి చేశారు. పోతిరెడ్డిపాడు హెడ్ రెగ్యులేటర్ సామర్థ్యం పెంచి శ్రీశైలం ప్రాజెక్టుకు వరద వచ్చి నిండిన తర్వాత వేగంగా నీటిని గండికోట ప్రాజెక్టుకు తరలించే విధంగా, గాలేరు–నగరి వరద కాలువల్లో పదివేల క్యూసెక్కుల నీరు ప్రవహించే విధంగా చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నెలరోజుల నుంచి భారీగా వరదలు వచ్చి శ్రీశైలం ప్రాజెక్టు నిండుకుండలా తయారైంది. ఇంకా వరద నీరు వస్తుండటంతో గేట్ల ద్వారా నాగార్జున సాగర్‌కు విడుదల చేశారు. గాలేరు–నగరి వరద కాలువ ద్వారా బనకచర్ల, వెలుగోడు ప్రాజెక్టులను నింపిన తర్వాత అవుకు రిజర్వాయర్ నుంచి మైలవరం, గండికోట ప్రాజెక్టులకు నీరు రావాల్సి ఉంది. కానీ ప్రస్తుతం వర్షాలు తగ్గుముఖం పడుతున్నాయి. కృష్ణానది పరివాహక ప్రాంతాల్లో వరద కూడా తగ్గుముఖం పడుతోంది. ప్రస్తుతం అవుకు రిజర్వాయర్‌కు కేవలం ఆరు వందల క్యూసెక్కుల నీటిని మాత్రమే విడుదల చేస్తున్నారు. ఈ పరిస్థితుల్లో భవిష్యత్తులో ఎక్కువ నీరు విడుదలైతే తప్ప గండికోట, మైలవరం ప్రాజెక్టులకు నీరు వచ్చి చేరే పరిస్థితి కనిపించడం లేదు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య



ఆత్మహత్య చేసుకున్న రైతు గంగిరెడ్డి

వేముల : అప్పుల బాధ తాళలేక దుంపల గంగిరెడ్డి(52) అనే రైతు ఇంటిలో ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన మండలంలోని నారేపల్లె గ్రామంలో జరిగింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన దుంపల గంగిరెడ్డి పంటలు పండక, దిగుబడులు రాక నష్టపోయాడు. సాగు కోసం చేసిన అప్పులు పెరిగిపోయాయి. గత కొంత కాలం నుంచి భార్యకు, కుమారునికి ఆరోగ్యం సరిగా లేదు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురై ఆదివారం రాత్రి ఇంటిలోని వంటగదిలో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటనపై చిన్నకుమారుడు మణికంఠారెడ్డి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ ధనుంజయుడు తెలిపారు.

అనారోగ్యంతో..

లింగాల : లింగాల మండలం ఇప్పట్ల గ్రామ సమీపంలోని సోత్రిమ్‌లో నివాసముంటున్న కేతిరెడ్డి ఓబులరెడ్డి (60) అనే వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డారు. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. ఆయనకు డయాబెటీస్, గుండెజబ్బు వంటి వ్యాధులు ఉన్నాయని, వ్యాధులు నయం కావన్న భయంతో శుక్రవారం చీనీ పంటలకు కొట్టే పురుగుమందును తాగాడు. వెంటనే పులివెందులలోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. ఆయనకు భార్య వసుంధర, ముగ్గురు కుమార్తెలు, కుమారుడు ఉన్నారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామన్నారు.

స్కీమ్ వర్కర్లపై వేధింపులు ఆపాలి



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న సీఐటీయూ నాయకులు, స్కీం వర్కర్స్ యూనియన్ల ప్రతినిధులు

కడప సెవెన్‌రోడ్స్ : స్కీమ్ వర్కర్లు, కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ సిబ్బందిపై రాజకీయ వేధింపులు ఆపాలంటూ సీఐటీయూ నాయకులు సోమవారం కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులురెడ్డి మాట్లాడుతూ ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన కార్మికులపై అధికార పార్టీ నాయకులు వేధింపులకు పాల్పడటం తగదన్నారు. రాజకీయంగా ఒత్తిడి తీసుకొచ్చి వారిచేత బలవంతంగా రాజీనామాలు చేయిస్తున్నారని ఆరోపించారు. జిల్లాలో 14 మండలాల్లో ఫీల్డ్ అసిస్టెంట్లు, అంగన్వాడీలను తొలగించారన్నారు. కడప, కమలాపురం, ముద్దనూరు, వేంపల్లె, చాపాడులలో వేధింపులు అధికంగా ఉన్నాయన్నారు. జిల్లా కార్యదర్శి లక్ష్మీదేవి మాట్లాడుతూ టీడీపీ ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు దాటకముందే స్కీమ్ వర్కర్లను వేధించి రాజీనామాలు చేయించడం అన్యాయమన్నారు. సీఐటీయూ నగర అధ్యక్షులు చంద్రారెడ్డి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆ సంఘం నగర కార్యదర్శి పి.సుబ్బయ్య, మున్సిపల్ యూనియన్ కార్యదర్శి విజయ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు. అనంతరం డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రం సమర్పించారు.

రాణించిన కడప బ్యాట్స్‌మన్

- హాఫ్ సెంచరీలు నమోదు చేసిన నలుగురు
- 9 వికెట్లు తీసిన నెల్లూరు బౌలర్ హమీద్



76 పరుగులు చేసిన రోహిత్



9 వికెట్లు తీసిన హమీద్



5 వికెట్లు తీసిన దొరబాబు

కడప స్పోర్ట్స్ : కడప నగరంలో నిర్వహిస్తున్న ఏసీఏ అండర్–19 అంతర్ జిల్లాల క్రికెట్ టోర్నమెంట్‌లో కడప బ్యాట్స్‌మన్ నలుగురు హాఫ్ సెంచరీలతో రాణించారు. కేఓఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కడప, నెల్లూరు జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కడప జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. బ్యాటింగ్‌కు దిగిన కడప జట్టు 91.1 ఓవర్లలో 347 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ఆర్. రోహిత్ 76, సాయిచేతన్ రెడ్డి 72, ఎన్.గురుచరణ్ 70 పరుగులు చేశారు. ప్రణవ్‌కుమార్‌రెడ్డి 66 పరుగులు చేశాడు. నెల్లూరు బౌలర్ హమీద్ 23.4 ఓవర్లలో 83 పరుగులు ఇచ్చి 9 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన నెల్లూరు జట్టు తొలిరోజు ఆట ముగిసే సమయానికి 1 ఓవర్‌లో వికెట్ నష్టపోకుండా 6 పరుగులు చేసింది.

వైఎస్ఆర్ఆర్–ఏసీఏ స్టేడియం..

వైఎస్ రాజారెడ్డి–ఏసీఏ క్రికెట్ మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో కృష్ణా, శ్రీకాకుళం జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన కృష్ణా జట్టు బ్యాటింగ్ ఎంచుకుంది. 71.1 ఓవర్లలో 219 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని ధనుష్ 62, వరుణ్‌సాత్విక్ 34, భానువరప్రసాద్ 34 పరుగులు చేశారు. శ్రీకాకుళం బౌలర్లు పూర్ణ 4, సుశాంత్ 2 వికెట్లు తీశారు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన శ్రీకాకుళం జట్టు 12.5 ఓవర్లలో 2 వికెట్ల నష్టానికి 34 పరుగులు చేసింది. జట్టులోని సుశాంత్ 20 పరుగులతో క్రీజులో ఉన్నాడు. దీంతో తొలిరోజు ఆట ముగిసింది.

కేఎస్ఆర్ఎం మైదానంలో..

కేఎస్ఆర్ఎం మైదానంలో నిర్వహించిన మ్యాచ్‌లో చిత్తూరు, పశ్చిమగోదావరి జట్లు తలపడ్డాయి. టాస్ గెలిచిన పశ్చిమగోదావరి జట్టు 54.4 ఓవర్లలో 262 పరుగుల వద్ద ఆలౌట్ అయింది. జట్టులోని రక్షణ్ 50 పరుగులు, యశ్వంత్ 42 పరుగులు చేశారు. చిత్తూరు బౌలర్లు దొరబాబురెడ్డి 5 వికెట్లు, సాయిచరణ్ 2 వికెట్లు తీశాడు. అనంతరం బ్యాటింగ్‌కు దిగిన చిత్తూరు జట్టు 34 ఓవర్లలో 3 వికెట్ల నష్టానికి 99 పరుగులు చేసింది. జట్టులోని హర్షసాయిరెడ్డి 55 పరుగులు చేశాడు. పశ్చిమగోదావరి బౌలర్లు యశ్వంత్ 2 వికెట్లు తీశాడు.

కబ్జాకు గురైన భూములను స్వాధీనం చేసుకోవాలి



తహసీల్దారు కార్యాలయం వద్ద ధర్నా నిర్వహిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

బద్వేలు అర్బన్ : మండల పరిధిలోని సి.కొత్తపల్లె గ్రామ పొలంలో కబ్జాకు గురైన కోట్లాది రూపాయల విలువ చేసే ప్రభుత్వ భూములను తక్షణమే స్వాధీనం చేసుకుని కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి అన్వేష్ కోరారు. సోమవారం స్థానిక తహసీల్దారు కార్యాలయం వద్ద నిర్వహించిన ధర్నా కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ సి.కొత్తపల్లె పొలంలో గత 5 నెలలుగా ప్రభుత్వ భూమిలో గుడిసెలు వేసుకుని నివసిస్తున్న పేదలకు మూడు సెంట్లు చొప్పున ఇళ్ల స్థలాలు ఇవ్వాలని కోరారు. అలాగే ఈ నెల 2న పేదల గుడిసెలను తొలగించి దళిత మహిళలపై దాడికి పాల్పడిన టీడీపీ నాయకులు రామచంద్రారెడ్డి, ఆయన అనుచరులను అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు వెంకటేష్, మండల నాయకులు రమణ, రవిచంద్ర, రామ్మోహన్, దుర్గమ్మ, సుభద్ర తదితరులు పాల్గొన్నారు.

వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలి



మాట్లాడుతున్న ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కేసీ బాదుల్లా

కడప వైఎస్ఆర్ సర్కిల్ : కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పార్లమెంటులో ప్రవేశపెట్టనున్న వక్ఫ్ ఆస్తుల సవరణ బిల్లును వ్యతిరేకించాలని ఇన్సాఫ్ జిల్లా అధ్యక్షుడు కె.సి.బాదుల్లా కోరారు. సోమవారం నగరంలోని ఇన్సాఫ్ కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ముస్లింల భూ యాజమాన్య హక్కులను హరించేందుకు, ద్వితీయ శ్రేణి పౌరులుగా మార్చే కుట్రలో భాగంగా మోదీ ప్రభుత్వం ఈ కుట్రకు పాల్పడుతోందన్నారు. తెలుగుదేశం, జనసేన, వైఎస్సార్‌సీపీ ఎంపీలు ఈ బిల్లును వ్యతిరేకించాలన్నారు. స్వాతంత్య్రం వచ్చిన తర్వాత ముస్లింల ఆస్తులను కాపాడేందుకు 1954 వక్ఫ్ చట్టం తీసుకొచ్చారన్నారు. ప్రస్తుతం వక్ఫ్ ఆస్తులు అన్యాక్రాంతమవుతున్నాయని కాపాడేందుకు ఎండోమెంట్ తరహాలో అధికారాలు ఇవ్వాల్సింది పోయి వక్ఫ్ ఆస్తులను కాజేసే ప్రయత్నం చేయడం దుర్మార్గమన్నారు. ఈ సమావేశంలో ఇన్సాఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్ గౌస్, ఎస్.దస్తగిరి పాల్గొన్నారు.

సెప్టెంబరు 7, 8 తేదీల్లో ఆరోగ్యమాత ఉత్సవాలు

కడప కల్చరల్ : కడప నగరం రైల్వేస్టేషన్ వద్దగల ఆరోగ్యమాత పుణ్యక్షేత్రం ఉత్సవాలు సెప్టెంబర్ 7, 8 తేదీలలో వైభవంగా నిర్వహించనున్నామని పుణ్యక్షేత్ర డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ ఎండీ ప్రసాదరావు తెలిపారు. సోమవారం ఆరోగ్యమాత చర్చిలో తిరునాల పోస్టర్లను సహాయ డైరెక్టర్ రెవరెండ్ ఫాదర్ పిల్లి మహేష్, ఆరోగ్యమాత మదర్ జనరల్ సుపీరియర్ సెల్వి రాయప్పన్, చర్చి పెద్దలతో కలిసి ఆయన ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో ఆంథోని, రాజన్, డేవిడ్, జార్జి, సెబాస్టిన్, విక్టర్, మోహన్, రాజకుమార్, జయరాజ్, యూత్ కమిటీ సభ్యులు ప్రసాద్, విన్సెంట్ ది పాల్, ఆ క్షేత్రం అన్ని విభాగాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

నదీ జలాల పునః పంపిణీ ద్వారా రాష్ట్ర హక్కులు కాపాడాలి

– ఏపీ రైతు సంఘం



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న రైతు సంఘం నాయకులు

కడప సెవెన్‌రోడ్స్ : కృష్ణా, గోదావరి నదీ జలాల పునః పంపిణీ ద్వారా రాష్ట్ర నీటి హక్కులను కాపాడాలని ఏపీ రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు ఎంవీ సుబ్బారెడ్డి, ప్రధాన కార్యదర్శి భాస్కర్, వర్కింగ్ అధ్యక్షుడు మనోహర్‌రెడ్డి కోరారు. సోమవారం ఈ మేరకు డీఆర్వో గంగాధర్‌గౌడ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. వారు మాట్లాడుతూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు రాష్ట్ర ప్రభుత్వం ఈ మేరకు నివేదిక సమర్పించిందన్నారు. అనుమతులు లేకుండా తెలంగాణ ప్రభుత్వం నిర్మిస్తున్న పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకం, దిండి ప్రాజెక్టు, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం ఫేస్–2లను వెంటనే ఆపాలని కోరారు. ప్రతి యేటా పులిచింతల ప్రాజెక్టులో 30.23 టీఎంసీల నీరు నిల్వ ఉండేలా చూడాలన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు కట్టా యానాదయ్య, రామ్మోహన్‌రెడ్డి, సి.సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

ఈ అధ్యాపకుడి ఆత్మహత్యకు కారకులు ఎవరు?



లింగాల వెంకటరామిరెడ్డి(ఫైల్)

ప్రొద్దుటూరు : వంద కిలో మీటర్ల వేగంతో నడిచే రైలుకు ఎదురెళ్లి ఆత్మహత్యకు పాల్పడాలంటే మనిషికి ఎంత ధైర్యం కావాలి.. ఆ మనసు ఎంత గాయపడి ఉండాలి.. ప్రొద్దుటూరు పట్టణంలోని ప్రైవేటు కళాశాలలో జువాలజీ అధ్యాపకుడిగా పనిచేస్తున్న లింగాల వెంకటరామిరెడ్డి శనివారం ఎర్రగుంట్లలో రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ప్రతి ఒక్కరిని కలచివేసింది. తీవ్ర మానసిక వేదన చెందిన వెంకటరామిరెడ్డి రైలు కిందికి దూరడంతో ఆయన శరీరం రెండు ముక్కలుగా విడిపోయింది.

రైల్వేకోడూరు ప్రాంతానికి చెందిన అధ్యాపకుడు ప్రొద్దుటూరు సమీపంలోని ఓ గ్రామంలో వివాహం చేసుకుని ఇక్కడే స్థిరపడ్డాడు. ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డికి చెందిన కళాశాలలో అధ్యాపకుడిగా పనిచేస్తున్నాడు. ఆయనకు ఇద్దరు కుమారులు ఉండగా పెద్ద కుమారుడు విశ్వకాంత్ రెడ్డి సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తూ ఫారెక్స్ ట్రేడింగ్ మార్కెట్ వ్యాపారం చేసేవాడు. కమలాపురానికి చెందిన ఓ యువతితో గత ఏడాది ఏప్రిల్‌లో ఇతనికి నిశ్చితార్థం జరిగింది. వారిద్దరు కలిసి ట్రేడింగ్ వ్యాపారం చేయగా వ్యాపార లావాదేవీల్లో ఆర్థిక సమస్యలు ఏర్పడ్డాయి. ఇందుకు సంబంధించి వెంకటరామిరెడ్డి కుమారుడు యువతికి డబ్బు చెల్లించాల్సి ఉంది. చాలా రోజులుగా ఈ విషయంపై పంచాయితీలు జరుగుతున్నాయి. డబ్బు చెల్లించడంలో జాప్యం జరిగింది. స్థానిక అధికార పార్టీ నేత కుటుంబీకులు యువతీ యువకులకు బంధువులు కావడంతో పంచాయితీ చేశారు. పలు మార్లు ఈ పంచాయితీ జరిగింది. డబ్బు చెల్లించడంలో తీవ్ర జాప్యం చేస్తున్నారని యువతి తండ్రి కోడూరు అమరనాథరెడ్డి, కుమారుడు అనిల్ రెడ్డి గత నెల 10న ప్రొద్దుటూరులోని వరలక్ష్మి అపార్ట్‌మెంట్ వద్ద ఉన్న అధ్యాపకుని ఇంటికి వెళ్లి దాడి చేశారు. యువతి బంధువులు అధ్యాపకుడు పనిచేస్తున్న కళాశాలకు వెళ్లి వార్నింగ్ ఇచ్చారు. ఈ సంఘటనపై గత నెల 10వ తేదీన లింగాల వెంకటరామిరెడ్డి చిన్న కుమారుడు విశ్వతేజ రెడ్డి వన్‌టౌన్ పోలీసులకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశాడు. యువతి కుటుంబంతోపాటు వారి బంధువుల వల్ల తమకు ప్రాణహాని ఉందని, తమపై దాడి చేసిన వారిని శిక్షించాలని సీఐకి ఇచ్చిన ఫిర్యాదులో పేర్కొన్నారు. అయితే రాజకీయ జోక్యం కారణంగా ఈ సంఘటనపై పోలీసులు కేసు నమోదు చేయలేదు. సమాజంలో విలువలతో జీవించే తమపై దాడి చేసినా పోలీసులు కేసు నమోదు చేయకపోవడంతోపాటు డబ్బు చెల్లించాలని పంచాయితీలో పెద్దలు తీర్పు ఇవ్వడంతో మనసు నొచ్చుకున్న అధ్యాపకుడు నేరుగా కళాశాలకు వెళుతున్నానని ఇంటిలో చెప్పి రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. తమకు సంబంధం లేకున్నా ఎన్నో సివిల్ పంచాయితీలు చేస్తున్న పోలీసులు బాధితులు ఫిర్యాదు ఇచ్చినా పట్టించుకోకపోవడం గమనార్హం. ఫిర్యాదు అనంతరం పోలీసులు జోక్యం చేసుకుని ఇరువురిని పిలిపించి ఉంటే పరిస్థితి అధ్యాపకుడి ఆత్మహత్య వరకు దారితీసేది కాదు. పోలీసు ఉన్నతాధికారులు ఈ సంఘటనపై విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని మృతుడి కుటుంబ సభ్యులు కోరుతున్నారు. అధ్యాపకుడు ఆత్మహత్య చేసుకున్న అనంతరం ఆయన కుమారులు రైల్వే పోలీసులకు ఇచ్చిన ఫిర్యాదులో కూడా ఈ విషయాన్ని పేర్కొన్నారు.

'ఆ ఎస్ఐ నాపై దాడి చేశాడు'

- ఎర్రగుంట్ల ఎస్ఐ చేతిలో గాయపడిన మహిళ
- ప్రొద్దుటూరు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న బాధితురాలు
- న్యాయం చేయాలని ఎస్పీకి ఫిర్యాదు



జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న నర్మద

ప్రొద్దుటూరు : రెండేళ్ల క్రితం తాను ఎర్రగుంట్లలో నివాసం ఉన్నప్పుడు మరో మహిళ నగలు దొంగలించానని ఇప్పుడు తనను స్టేషన్‌కు తీసుకెళ్లి ఎస్ఐ భాస్కర్‌రెడ్డి తన గూబ గుయ్.. మనిపించాడని ప్రొద్దుటూరు పట్టణంలోని వైఎంఆర్ కాలనీకి చెందిన నల్లబోతుల నర్మద ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక జిల్లా ప్రభుత్వాస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమె సోమవారం మాట్లాడుతూ తమ స్వగ్రామం పెద్దముడియం మండలం జె.కొత్తపల్లె గ్రామం అని తెలిపారు. వ్యవసాయంలో రాబడి లేకపోవడంతో ఉపాధి నిమిత్తం రెండేళ్ల క్రితం తాను ఎర్రగుంట్ల ఆశ్రమం వీధిలో నివాసం ఉన్నానని, ఆ సమయంలో తన ఇంటి పక్కన ఉన్న తిరుపేలమ్మ అనే మహిళతో పరిచయం ఏర్పడిందన్నారు. ఆ విధంగా తిరుపేలమ్మ బంధువు మంగళ రాజేశ్వరి కూడా పరిచయమైందన్నారు. ఆరు నెలల తర్వాత తాను అక్కడి నుంచి ప్రొద్దుటూరు వైఎంఆర్ కాలనీలోని సాయినగర్‌కు వచ్చి స్థిరపడ్డానన్నారు. కాగా గత నెల 21న ఎర్రగుంట్ల ఎస్ఐ పిలుస్తున్నారని, కానిస్టేబుళ్లు విజయేంద్రరెడ్డి, మరో ముగ్గురు తనతోపాటు తన తండ్రిని పోలీస్ స్టేషన్‌కు తీసుకెళ్లారన్నారు. గతంలో తాను ఎర్రగుంట్లలో ఉన్నప్పుడు రాజేశ్వరి నగలను దొంగిలించానని ఫిర్యాదు వచ్చిందని ఎస్ఐ చెప్పారన్నారు. ఈ నగల దొంగతనానికి తనకు సంబంధం లేదని చెప్పినా ఎస్ఐ తన చెంపలపై కొట్టి గూబ గుయ్.. మనిపించాడన్నారు. ఒత్తిడి చేసి తెల్లపేపర్లపై సంతకాలు చేయించుకున్నారని తెలిపారు. దాంతో అప్పటి నుంచి తనకు ఎడమ చెవి పనిచేయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాగా రాజేశ్వరి పోలీసులకు లిఖిత పూర్వకంగా ఎలాంటి ఫిర్యాదు చేయలేదని, ఎఫ్ఐఆర్ కూడా నమోదు కాలేదన్నారు. కేవలం కుట్రపూరితంగా ఎస్ఐతోపాటు సిబ్బంది ఈ విధంగా చేస్తున్నారని ఆరోపించారు. బంగారు నగల అపహరణకు సంబంధించి రూ.6.50 లక్షలు ఇస్తావా లేక నగలు ఇస్తావా అని పోలీసులు ఒత్తిడి చేస్తున్నారని చెప్పారు. పోలీసులపై చర్యలు తీసుకోవాలని బాధితురాలు జిల్లా ఎస్పీకి ఫిర్యాదు చేశారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు డీఏవీ భారతి విద్యార్థులు



రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులతో ప్రిన్సిపల్ కిషోర్, హెచ్ఆర్ గోపాల్‌రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని నల్లలింగాయపల్లెలో ఉన్న భారతి సిమెంట్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ (బీసీపీసీఎల్) లోని డీఏవీ భారతి విద్యార్థులు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపల్ శివం కిషోర్ కుమార్ తెలిపారు. ఏసీసీ వాడి డీఏవీ క్లస్టర్ లెవెల్ స్పోర్ట్స్ మీట్ 2024–25 కర్ణాటకలోని కల్బుర్గి వాడి డీఏవీ పాఠశాలలో జరిగింది. ఈ మీట్‌కు హాజరైన డీఏవీ భారతి విద్యార్థులు పలు క్రీడాంశాల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. అండర్–14 బాలుర విభాగం చదరంగం పోటీల్లో ఎస్ఎంవీ కౌశిక్, డి.రామ్ చరణ్, ఎం.లోహితేశ్వ, ఐ.చక్రధర్ రెడ్డి, కె. సనత్ సిద్ధార్థ్ ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే అండర్–17 బాలుర విభాగం అథ్లెటిక్స్ పోటీల్లో 1500 మీటర్ల పరుగు పందెంలో బి. చంద్ర ఓబుళరెడ్డి ద్వితీయ స్థానంలో, అండర్–14 కబడ్డీ బాలుర, బాలికల విభాగంలో ప్రథమ స్థానంలో నిలిచాడు. అండర్–17 బాలుర అథ్లెటిక్స్‌లో ఎం. నరేష్ డిస్కస్ త్రో, 800 మీటర్ల విభాగంలో తృతీయ స్థానంలో, అండర్–17 బాలికల అథ్లెటిక్స్ విభాగంలో జి. గురు కీర్తన షాట్‌పుట్ విభాగంలో తృతీయ స్థానంలో నిలిచారు. వీరంతా త్వరలో జరిగే డీఏవీ రాష్ట్ర స్థాయి పోటీల్లో పాల్గొంటారని ప్రిన్సిపల్ వివరించారు. కాగా రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను, పీడీ చందును ప్లాంట్ సీఎంఓ సాయిరమేష్, హెచ్ఆర్ చీఫ్ గోపాల్‌రెడ్డి, డీఏవీ ప్రాంతీయ అధికారి శేషాద్రి అభినందించారు. అలాగే రాష్ట్ర స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబరిచి రాణించాలని సూచించారు.